RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 86 పేజీలు - 08 ఆదివారం 22 ఫిబ్రవరి 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక



- కారిడార్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

2లో

## అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్

- ఆలయాలే లక్ష్యంగా దాడికి స్కెచ్
- నిఘా వర్గాల హెచ్చరికలు జారీ
- ఇతర నగరాల్లోనూ పేలుళ్లకు కుట్ర



## ఢిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21:** దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయిబా(రామ) కుట్ర పన్నింది. ఈ మేరకు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో ఢిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్ ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా ఎల్ఈటీ దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. చాందినీ మిగతా2లో...

## కాంగ్రెస్‌లో కష్టపడితేనే పదవులు వరిస్తాయి

- అవకాశాలను అందిపుచ్చుకుని సాగాలి
- డిసిసి అధ్యక్ష పదవి ఎదిగేందుకు తొలిమెట్టు
- ఎవ్వరికైనా మెరిట్ లిస్ట్ ప్రకారమే అవకాశం
- భిన్నాభిప్రాయాలు పార్టీ కార్యకర్తల స్థయిర్యాన్ని దెబ్బతీస్తాయి
- డిసిసి అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి



**తొలి అక్షరం/వికారాబాద్,ఫిబ్రవరి 21:** భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గాంధీ సిద్ధాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు.రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్




రెడ్డి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై మిగతా2లో...

## దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం

కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక



**తొలి అక్షరం/గౌహతి,21 :** నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని మిగతా2లో...

## రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని మన్నించిన సిసిఐ

- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలు వెంటనే స్పందించారు
- పత్తి కొనుగోళ్లు ఈ నెలాఖరు వరకు కొనసాగుతాయి
- పత్తి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావువెల్లడి

**తొలి అక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి 21 :** రాష్ట్రంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగనున్న పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని, ఈ అవకాశాన్ని పత్తిరైతులు వినియోగించుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తమ అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు సీసీఐ పొడిగించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించాలని ఇప్పటికే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లను కోరినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. పొడిగించిన గడువును మిగతా2లో...



## మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి

- జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మంత్రి సీతక్క



**తొలి అక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి 21 :** మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క అన్నారు. వారిని ఆర్థికంగా స్థితిమంతులుగా చేయడానికి ఇందిరా మహిళా శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ ఆర్థిక సాక్షరత సదస్సులో మహిళా సాధికారతలో తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతిని ఆవిష్కరించారు. 46.68 లక్షల మంది మహిళలు 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సా ధికారతకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. గడిచిన రెండేండ్లలో మహిళా సంఘాలకు రూ.35.435 కోట్ల బ్యాంకింగ్ రుణాల మంజూరు

మిగతా2లో...

## అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు

- సుంకాలు వెంటనే అమల్లోకి..
- సుప్రీం తీర్పు తర్వాత ట్రంప్ ప్రకటన
- సుప్రీం తీర్పుపై ట్రంప్ తీవ్ర నిరాశ
- వాణిజ్య దిగ్బంధం విధిస్తానని హెచ్చరిక



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21:** ప్రపంచ దేశాలపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత అధ్యక్షుడు ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఈ సుంకాలు వెంటనే అమల్లోకి వచ్చేలా ఒక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయితే ఈ సుంకాలు ఫిబ్రవరి 24 నుంచి అమల్లోకి వస్తాయని వైట్‌హౌస్ వెల్లడించింది. ఇవి 150 రోజుల పాటు అమల్లో ఉంటాయని తెలిపింది.అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు విధించేందుకు ఓవల్ ఆఫీస్ నుంచి సంతకం చేయడం

మిగతా2లో...

## ఆరు రాష్ట్రాల్లో పూర్తయిన సర్ ప్రక్రియ

గుజరాత్‌లో 68 లక్షల 12 వేల 711 ఓట్ల తొలగింపు

వవరాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం




2లో

## అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

- దేశ రైతులతో పాటు తెలంగాణకూ ముప్పే
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



**తొలి అక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి 21:** కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు. మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం నుంచి ఈ పంటలను దిగుమతి మిగతా2లో...

## గ్రామీణ ప్రాంతాల్లో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు

కనీసం ఈ ఏడాదిలోనైనా 3 లక్షల ఇండ్లు మంజూరు చేయండి

పేదల సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పం

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పొంగులేటి విజ్ఞప్తి



**తొలి అక్షరం/హైదరాబాద్,ఫిబ్రవరి 21:** తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా 2014-23 వరకు దాదాపు పది సంవత్సరాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. దీంతో ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన ఇండ్లను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల సంక్షేమాన్ని

మిగతా2లో...

# కాంగ్రెస్‌లో కష్టపడితేనే పదవులు వరిస్తాయి

(మొదటి పేజీ తరువాయి)

చర్చించేందుకు ఈ తరగతులు సహాయపడతాయని సీఎం అన్నారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు బయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారని తెలిపారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం.. అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు' అని రేవంత్ అన్నారు. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు.రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని.. మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని.. ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడన్నారు. 'డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు' అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనాయకులను అవమానపరచాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం నుంచి షర్మిల వచ్చినా ఆమె అవకాశాలను తీసుకోలేదన్నారు. ముళ్లబాటలో కూడా ఏపీలో కాంగ్రెస్ కోసం షర్మిల కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజల దగ్గరికి వెళ్ళి రాజకీయాల్లో రాణించాలని షర్మిల చేస్తున్న కృషిని ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరయ్యారు. అలాగే, రెండు రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు

# రాష్ట్రప్రభుత్వ విన్నపాన్ని మన్నించిన సిసిఐ

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించుకొని పత్తిని అమ్ముకోవాలని పత్తి రైతులను మంత్రి తుమ్మల కోరారు.రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, రాష్ట్రంలోని పత్తి రైతులకు ఇబ్బంది కలగకుండా, ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లను కొనసాగించాలని సీసీఐ అంగీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. రైతుల ప్రయోజనాలను ప్రాధాన్యంగా తీసుకొని కొనుగోళ్ల గడువును పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో పత్తి సాగు ఆలస్యంగా ప్రారంభమవడంతో దిగుబడులు కూడా ఆలస్యంగా మార్కెట్‌కు వస్తున్నాయి. ఈ వాస్తవ పరిస్థితిని కేంద్రానికి వివరిస్తూ కొనుగోళ్ల గడువును పొడిగించాలని మంత్రి గారు కోరారు. అలాగే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తో రాష్ట్ర పరిస్థితిని వివరించి, రైతులకు నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 45.32 లక్షల ఎకరాలలో పత్తిని సాగు చేయగా, 28.29 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేయడం జరిగింది. ఇప్పటివరకు 8,80,053 మంది రైతుల నుంచి రూ.12,823 కోట్ల విలువైన 16.15 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అదేవిధంగా ఇప్పటివరకు మార్కెట్ ద్వారా 2.24 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యత ప్రమాణాలు లేని పత్తిని కోనుగోలు చేయడం జరిగింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఇంకా 9.99 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి రైతుల వద్ద ఉందని మార్కెటింగ్ అధికారులు అంచనా వేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ పై మొదట రైతులు మరియు జిన్నర్ల నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తూ, రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన యాప్ కి రాష్ట్ర ప్రభుత్వం సపోర్టు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీంతో ఈ యాప్ ద్వారా రైతులు క్యూలలో నిలబడే అవకాశం లేకుండా, సమయపాలన పాటిస్తూ, రైతులకు దగ్గరలోని పత్తి కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించుకునే అవకాశం కలగడంతో పాటు, పత్తి కొనుగోళ్లను రెగ్యులేట్ చేస్తూ, పారదర్శకంగా కొనుగోళ్లను చేపట్టే వెసులుబాటు కలిగిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో రైతులకు సమయానికి ఎరువుల పంపిణీకి తమ సర్కారు మొబైల్ యూరియా బుకింగ్ యాప్ ని తీసుకొచ్చిందన్నారు. తద్వారా యూరియా బ్లాక్ మార్కెటింగ్ అరికట్టడంతో పాటు అధిక నిల్వలను నియంత్రిస్తూ పారదర్శక పంపిణీ వ్యవస్థ అమల్లోకి వచ్చిందన్నారు. పంట పూర్తిగా మార్కెట్‌కు రాకముందే సీసీఐ వారు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తారనే సమాచారంతో రైతుల్లో ఆందోళన నెలకొందని, నాణ్యమైన పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందనే భయం రైతుల్లో ఉన్న నేపథ్యంలో, మరో 30 రోజులు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలని మంత్రి తుమ్మల సీసీఐను ప్రత్యేకంగా కోరారు.

# అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు.

# మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

చేశామన్నారు.ఇందిరా మహిళా శక్తితో 2.05 లక్షల సూక్ష్మ వ్యాపారాలను మహిళా సంఘాలు స్థాపించాయని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ జాతరలో ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళా సంఘాలకు రూ.3.5 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. వారికి స్థిరమైన ఆదాయం కల్పించేందుకు ఆర్టీసీ అ÷-దదె బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ఎలాంట్లు మహిళా సంఘాలతో ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. జీడీపీలో మన దేశ మహిళల భాగస్వా మ్యం 18 శాతమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 40 శాతంగా ఉందన్నారు. మంత్రి సీతక్క ప్రసంగాన్ని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు.

# అన్ని దేశాలపై 10 శాతం సుంకాలు

(మొదటి పేజీ తరువాయి)

తనకు చాలా గౌరవంగా ఉందని ట్రూత్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇవి దాదాపు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు. ఈ విషయంపై అందిరికి ధన్యవాదాలు అని రాసుకొచ్చారు. చట్టపరమైన మరో అధికారాన్ని అమలు చేసే వరకు ఈ కొత్త సుంకం అమల్లో ఉంటుందని వైట్ హౌస్ అధికారి ఒకరు పేర్కొన్నారు. వాణిజ్య భాగస్వాములు అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలు ప్రకారం టారిఫ్‌లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. భారత్ 10 శాతం టారిఫ్ చెల్లించాలా అలాగే ఇది గతంలో ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకానమీక్ పవర్ యాక్ట్(ఐఈఈపీఏ) కింద విధించిన టారిఫ్‌లను భర్తీ చేస్తారా అని ప్రశ్నకు వైట్‌హౌస్ అధికారి ఈ మేరకు స్పందించారు. ఈ 10 శాతం గ్లోబల్ టారిఫ్ అనేది అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన రక్షణాత్మక వాణిజ్య విధానంలో భాగమని పేర్కొన్నారు. చెల్లింపుల సమతుల్యత లోటును తగ్గించడం, అన్యాయ వాణిజ్య విధానాలను పరిష్కరించే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మరోవైపు రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్న చమురు కొనుగోళ్లను భారత్ తన అభ్యర్థన మేరకు గణనీయంగా తగ్గించిందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌తో తనకు అద్భుతమైన సంబంధం ఉందని తెలిపారు. వైట్‌హౌస్‌లో అమెరికా సుప్రీంకోర్టు తను విధించిన టారిఫ్‌లను రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక భారత్‌తో ట్రేడ్ డీల్ కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. పరస్పర టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కొత్త చట్టపరమైన మార్గాల ద్వారా కొనసాగుతాయని సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉండగా, సుంకాలతో భారత్- పాక్ యుద్ధాన్ని పరిష్కరించినట్లు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. 'నేను పరిష్కరించిన 8 యుద్ధాల్లో 5 యుద్ధాలను టారిఫ్‌ల ద్వారా ముగించాను. మీకు నచ్చినా, నచ్చకపోయినా నేను 8 యుద్ధాలను ముగించాను. అందులో భారత్-పాకిస్థాన్ వంటి అణు యుద్ధానికి దారితీసే పెద్ద వివాదాలు కూడా ఉన్నాయి. గురువారం జరిగిన పీస్ బోర్డ్ సమావేశంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి మాట్లాడుతూ, అధ్యక్షుడు ట్రంప్ జోక్యం వల్ల 3.5 కోట్ల ప్రాణాలు కాపాడారని అన్నారు. వారు చాలా ప్రమాదకర చర్యలకు సిద్ధమవుతున్నారు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.భారత్-పాక్ ఘర్షణ సమయంలో 10 యుద్ధవిమానాలు కూల్చివేసినట్లు ట్రంప్ తెలిపారు. గురువారం 11 విమానాలు కూల్చివేశారని చెప్పిన ఆయన, ఇప్పుడు సంఖ్యను 10కి తగ్గించారు. ఆ యుద్ధం అణు యుద్ధానికి దారితీసేలా సాగుతోందని అన్నారు. దానిని టారిఫ్‌ల ద్వారానే ఆపినట్లు చెప్పారు. ఇరు దేశాలకు యుద్ధం చేయాలనుకుంటే చేయండని, కానీ అమెరికాతో వ్యాపారం చేయలేరు తేల్చి చెప్పాను. ప్రతి దేశంపై 200 శాతం టారిఫ్ విధిస్తాను హెచ్చరించాను. దీంతో ఇరుదేశాలు ఫోన్ చేసి విరమణ ఒప్పందానికి వచ్చినట్లు చెప్పారని ట్రంప్ పేర్కొన్నారు.మరోవైపు తన పన్నుల విధింపు అధికారాన్ని కట్టడి చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. శ్వేతసౌధంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన న్యాయవ్యవస్థపై ధ్వజమెత్తారు. ఈ తీర్పు దేశానికి తీరని అవమానమని, కొందరు న్యాయమూర్తులకు దేశం కోసం సరైన నిర్ణయం తీసుకునే ధైర్యం లేదని విమర్శించారు. అంతటితో ఆగకుండా, ఈ తీర్పు వెనుక 'విదేశీ ప్రయోజనాలు' ఉన్నాయని, న్యాయమూర్తులు బయటి వ్యక్తుల ప్రభావానికి లోనయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తనను ఆపలేదని ట్రంప్ స్పష్టం చేశారు. పాత చట్టం కింద వేసిన పన్నులను కోర్టు కొట్టివేస్తే, తక్షణమే 'సెక్షన్ 122' కింద 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. "నేను ఎంత పన్ను వేయాలనుకుంటే అంత వేస్తాను.

పాత చట్టాల కంటే ఇప్పుడు మా దగ్గర ఉన్నవి చాలా శక్తిమంతమైనవి. అవసరమైతే ఏ దేశంపైనైనా వాణిజ్య దిగ్బంధం విధిస్తాను, ఇతర దేశాల వాణిజ్యాన్ని దెబ్బతీసే అధికారం నాకుంది" అంటూ ఆయన తన దూకుడును ప్రదర్శించారు. సుంకాల విధింపు వల్ల అమెరికాలో పరిశ్రమలు కళకళలాడుతున్నాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. జార్జియాలోని ఒక స్టీల్ ప్లాంట్ యజమాని తనను కలిసి "సార్, మిమ్మల్ని ముద్దు పెట్టుకోవాలని ఉంది" అని అన్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. విదేశీ వస్తువుల దిగుమతి ఆగిపోవడంతో అమెరికాలో నిరు ద్యోగం తగ్గిందని, స్టాక్ మార్కెట్ 50 వేల మార్కును దాటిందని ఆయన గర్వంగా ప్రకటించారు. సుప్రీం కోర్టు తీర్పుతో గతంలో వసూలు చేసిన సుమారు 175 బిలియన్ డాలర్ల పన్ను ఆదాయం ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఆ డబ్బును వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందా అన్న ప్రశ్నకు.. "కోర్టు ఆ విషయం గురించి చర్చించలేదు, దీనిపై మరో ఐదేళ్ల పాటు కోర్టులో పోరాటం సాగుతుంది" అని ట్రంప్ దాటవేశారు.

# అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21:** ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ.12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.

# ఢిల్లీ ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

(మొదటి పేజీ తరువాయి)

చౌక్ ప్రాంతంలోని ఒక దేవాలయంపై ఐఈడీతో దాడి చేసేందుకు ఉగ్రవాదులు వ్యూహం పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. కేవలం ఢిల్లీలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలు కూడా ఉగ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నవంబర్ 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 12 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనపై దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మరోసారి ఎర్రకోట పరిసర ప్రాంతాలపై ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు రావడం దేశ రాజధానిలో కలకలం రేపుతోంది.

# దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు' అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు.రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

# ఆరు రాష్ట్రాల్లో పూర్తయిన సర్ ప్రక్రియ

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఫిబ్రవరి 21:** ఆరు రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయింది. ఆ వివరాలను ఎన్నికల కమిషన్ శనివారంనాడు విడుదల చేసింది. రివిజన్ ప్రక్రియలో భాగంగా ఆయా రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో అనర్హత కలిగిన ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. తాజాగా విడుదల చేసిన జాబితాలో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల కంటే గుజరాత్‌లో అత్యధికంగా ఓటర్ల తొలగింపు చోటుచేసుకుంది. రికార్డు స్థాయిలో 68 లక్షల 12 వేల 711 మందిని జాబితా నుంచి తొలగించింది. ఎస్ఐఆర్ ప్రక్రియకు ముందు 5,08,43,436 మంది ఓటర్లు ఉండగా అది ప్రస్తుతం 4,40,30,725కు తగ్గింది. మధ్యప్రదేశ్‌లో 34,25,078 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించింది. దీంతో ఓటర్ల సంఖ్య 5,74,06,143 నుంచి 5,39,81,065కు తగ్గింది. తర రాష్ట్రాల్లోనూ గణనీయంగా ఓటర్ల జాబితాలో సవరణలు చేటుచేసుకున్నాయి. రాజస్థాన్‌లో ఓటర్ల సంఖ్య 5,46,56,215 నుంచి 5,15,19,929 మందికి తగ్గింది. ఛత్తీస్‌గఢ్‌లో 2,12,30,737 నుంచి 1,87,30,914కు, కేరళలో 2,78,50,855 నుంచి 2,69,53,644కు తగ్గింది. గోవాలో ఓటర్ల సంఖ్య 11,85,034 నుంచి 10,57,566కు తగ్గింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ ఐలాండ్స్‌లో 52,364 మందిని జాబితా నుంచి తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 3,10,404 నుంచి 2,58,040కి తగ్గింది. పుదుచ్చేరిలో ఓటర్ల సంఖ్య 10,21,578 నుంచి 9,44,211 మందికి, లక్షద్వీప్‌లో 57,813 నుంచి 57,607కు తగ్గింది. ఓటర్ల మరణం, శాశ్వతంగా నివాసస్థలాల మార్పు, పలుచోట్ల రిజిస్టర్ చేయించుకోవడం, ఇతర అనర్హత కారణాల వల్ల ఓటర్ల తొలగింపు జరిగిందని, కొత్త ఓటర్లకు జాబితాలో చోటు కల్పించామని ఈసీ తెలిపింది. ఎన్నికల జాబితా అప్‌డేట్ అనేది నిరంతర ప్రక్రియ అని, అర్హత కలిగిన పౌరులు అప్లయ్ చేసుకోవడం, ఎంట్రీల కరెక్షన్ వంటివి చేసుకోవచ్చని పేర్కొంది.

# గ్రామీణ ప్రాంతాల్లో గడచిన 12 ఏండ్లల్లో ఒక్క ఇల్లు కూడా లేదు

(మొదటి పేజీ తరువాయి)

విస్మరించిన ఆనాటి ప్రభుత్వం పది సంవత్సరాలల్లో కేంద్రం నుండి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాలకు ఇండ్లు మంజురు చేయాలని గడిచిన రెండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాం. కానీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా గ్రామీణ ప్రాంతాలకు 3 లక్షల ఇండ్లు మంజురు చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం హైదరాబాద్ లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గృహ నిర్మాణానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో గృహ నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పది సంవత్సరాలలో సంవత్సరానికి కనీసం పదివేల ఇండ్లను కూడా నిర్మించలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక ఇల్లు కూడా తీసుకోలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో రెండేళ్ల క్రితం రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వచ్చే మూడు సంవత్సరాలలో రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజురు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతం అవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం గతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 1.0లో భాగస్వామ్యం కాలేదు. తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లలో ఏర్పడిన పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని పరిస్థితులను అర్థం చేసుకొని ఈ ఆర్థిక సంవత్సరములో 3 లక్షలు, వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఇండ్లను మజూరు చేయాలని' మంత్రి పొంగులేటి కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కి విజ్ఞప్తి చేశారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, పేదలకు సొంతింటి కల నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# సంత్ సేవాలాల్ ఆశయాల బాటలో నడుద్దాం








**• మంత్రి కొండా సురేఖ • పీడిత వర్గాల సమానత్వం కోసం కృషి చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ • బంజారాల ఆరాధ్య దైవంగా సేవాలాల్ మహారాజ్ స్మరణ • వరంగల్ 19వ డివిజన్‌లో ఘనంగా 287వ జయంతి ఉత్సవాలు • బంజారా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం సహకారం**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఫిబ్రవరి21:** పీడిత వర్గాల సమానత్వం,సామాజిక చైతన్యం కోసం అలుపెరగని కృషి చేసిన గొప్ప మహనీయుడు సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ అని రాష్ట్ర దేవాదాయ, అటవీ,పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కొనియాడారు.బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకలను పురస్కరించుకుని,వరంగల్ పరిధిలోని 19వ డివిజన్ కాశీబుగ్గలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ చిత్రపటానికి మంత్రి పూజలు చేసి నివాళులర్పించారు. బంజారా మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యం చేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం డీటీడీవో నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ కేవలం ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదని, బంజారా జాతిని చైతన్య పరిచిన గొప్ప సంస్కర్త అని పేర్కొన్నారు. ఆనాటి మూఢనమ్మకాలు, జంతు బలులను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారని, సమాజంలో నైతిక విలువలను పెంపొందించారని గుర్తు చేశారు. **అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది:** బంజారా బిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. నగరంలో బంజారాల కోసం సంత్ సేవాలాల్ ఆలయంతో పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్, మేయర్‌లతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ హాల్ ప్రాంగణంలోనే సంత్ సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అలాగే, గిరిజనులకు డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ప్రతినిధులు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేస్తే పరిశీలిస్తామన్నారు. కాగా, ఖమ్మం రోడ్డు ప్రాంతంలో దొంగిలించబడిన విగ్రహం ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏసీపీని మంత్రి ఆదేశించారు. **ఆదర్శాల బాటలో పయనించాలి: మేయర్ గుండు సుధారాణి** మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షణీయమన్నారు.సంపద కంటే సంస్కారం, అధికారం కంటే ఆదర్శం ముఖ్యమని సేవాలాల్ బోధించారు.ఆయన మార్గంలో నడవడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రికి, మేయర్‌కు బంజారా సంప్రదాయ తలపాగాలను ధరింపజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జయంతి నిర్వహణ కమిటీ చైర్మన్ భూక్య మోతిలాల్ నాయక్,స్థానిక కార్పొరేటర్లు,ఆర్డీవో సుమ, ఏసీపీ శుభం,ట్రైనీ ఐపీఎస్ మనీషా,కాంగ్రెస్ జిల్లా నాయకులు గోపాల నవీన్ రాజ్,బంజారా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన చిరుమర్తి లింగయ్య నకిరేకల్ మాజీ శాసనసభ్యులు



**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 21:** రామన్నపేట మండలం నీర్నంల గ్రామానికి చెందిన నోముల సత్యనారాయణ స్వరూప కుమార్తె వివాహానికి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినారు

## ఆహ్వాన పత్రిక అందజేత



**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 21:**మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎడ్ల నరేందర్ రెడ్డి సోదరి అనూష వివాహం ఈనెల 25 తేదీన హయత్ నగర్ లోని వి.ఆర్.సి కన్వెన్షన్ హాల్లో వివాహం జరుగనుండగా ఆహ్వాన పత్రికను ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్ రెడ్డికి మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డితో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

## నిర్మల్‌లో విషాదం..వైద్య చికిత్స లోపంపై బంధువుల ఆరోపణలు

**- నిజామాబాద్‌కు తరలించే లోపే బలి.. ఆసుపత్రి ముందు బంధువుల ఆందోళన**
**- తప్పు లేకపోతే ఖర్చులు ఎందుకు భరిస్తానన్నారు?**
**- వైద్యునిపై మృతుని కుటుంబీకుల నిలదీత**




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),ఫిబ్రవరి21:** వైద్యో నారాయణో హరి అని ప్రాణాలు కాపాడే దేవుడిగా భావించే వైద్యులు..కొందరు మాత్రం కసాయిలుగా మారుతున్నారు.నిర్మల్ పట్టణంలోని దేవేందర్ రెడ్డి ఆసుపత్రిలో జరిగిన దారుణం దీనికి అద్దం పడుతోంది.గుండె సమస్యతో చేరిన వృద్ధుడికి వరుసగా స్టంట్లు వేసి, పరిస్థితి విషమించాక చేతులు దులుపుకోవడంతో, మెరుగైన చికిత్స కోసం తీసుకెళ్లే లోపే ఆ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు.ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. **వరుసగా స్టంట్లు.. చివరకు చావే:** నిర్మల్ నియోజకవర్గం గాజుల నర్సాపూర్ గ్రామానికి చెందిన రాజేందర్ (60) గుండె సంబంధిత సమస్యతో దేవేందర్ రెడ్డి ఆసుపత్రిలో చేరారు.అక్కడి వైద్యులు ఆయనను పరీక్షించి స్టంట్ అవసరమని సూచించారు. అయితే ఒక స్టంట్ వేసిన మరుసటి రోజే మరో స్టంట్ వేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆపరేషన్ జరిగిన తర్వాత కూడా రోగి ఆరోగ్యం ఏమాత్రం మెరుగుపడకపోగా పరిస్థితి మరింత విషమించింది. **తప్పు ఒప్పుకున్నారా?:** రోగి పరిస్థితి విషమించడంతో ఆసుపత్రి యాజమాన్యం హుటాహుటిన నిజామాబాద్ తరలించాలని సూచించింది.కుటుంబ సభ్యులు రాజేందర్‌ను నిజామాబాద్ తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే ఆయన మరణించారు.అయితే నిజామాబాద్ ఆసుపత్రికి డాక్టర్ దేవేందర్ రెడ్డి నేరుగా వెళ్లి ఆసుపత్రి ఖర్చులు నేనే భరిస్తాను అని చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.మా వైపు పొరపాటు లేకపోతే, డబ్బులు ఇచ్చేందుకు డాక్టర్ ఎందుకు ముందుకు వచ్చారు? ఇది ముమ్మాటికి వారి నిర్లక్ష్యం వల్లే జరిగిన మరణం అని మృతుని బంధువు సునీల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. **ధర్నాతో హోరెత్తిన ఆసుపత్రి ప్రాంగణం:** రాజేందర్ మృతికి కారణమైన ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. రాజేందర్ మృతితో ఆయన భార్య సత్యగంగవ్వ, ముగ్గురు పిల్లలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని వారు స్పష్టం చేశారు. **మా వైపు ఎలాంటి లోపం లేదు: డాక్టర్** ఈ ఆరోపణలపై డాక్టర్ దేవేందర్ రెడ్డిని సంప్రదించగా.. రోగికి స్టంట్ వేసిన తర్వాత 'త్రాంబస్' (రక్తపు గడ్డ) సమస్య ఎదురైంది.చికిత్సలో మా వైద్యులు ఎక్కడా నిర్లక్ష్యం వహించలేదు అని బదులిచ్చారు.ఏది ఏమైనా, నిండు ప్రాణం బలి కావడంతో ప్రజలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు.బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## వివాహ కార్యక్రమంలో పాల్గొన్న దైద రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 21:** నకిరేకల్ నియోజకవర్గం కేంద్రాల్లోని బాబాసాహెబ్ గూడెం గ్రామానికి చెందిన సింగం వెంకన్న యాదవ్ కుమార్తె వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన దైద రవీందర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 7 వార్డ్ కాంగ్రెస్ ఇంచార్జ్ చింతల శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస చారి, నగేష్, సైదులు,మహేష్, సురేష్, వెంకటేష్ తదితరు పాల్గొన్నారు

## పండు తింటే నిండు జీవితం సాధ్యం: మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్








**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఫిబ్రవరి 21:** నిత్యజీవితంలో ఆహారంలో పండ్లను భాగంగా చేసుకుంటే నిండు ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ సూచించారు. తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ లో శనివారం ఫ్రూట్స్ డే నిర్వహించారు.పాఠశాల కరస్పాండెంట్ అను మాండ్ల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు 102 రకాల పండ్లను ప్రదర్శించారు. ఏ పండులో ఏ ప్రయోజనం దాగి ఉందో చార్టుల రూపంలో విద్యార్థులు వివరించారు.మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్ తో కలిసి చైర్మన్ శ్రావణ్ మాట్లాడారు. నేటితరం ఆరోగ్యకరమైన ఆహారానికి దూరమవుతుందని, ప్యాకేజ్, జంక్ ఫుడ్ కు బానిస అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు పండ్లను భాగంగా చేసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ప్రకృతి మనకు ప్రసాదించిన అపురూప వరం పండ్లు అని, నిత్యం పండ్లు తీసుకోవడం వల్ల విటమిన్లు ఖనిజాలు పీచు పదార్థాలు లభించి గుండె జబ్బులు క్యాన్సర్ వంటి వ్యాధులు దరిచేరవన్నారు. ప్రతి సీజన్లో దొరికే పండ్లను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్ లను పాఠశాల యాజమాన్యం సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నాగిరెడ్డి, సంపత్, సునీత, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు,ఇమ్మడి రాంబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎర్రం రెడ్డి అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

**• కాంగ్రెస్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అమీజ్**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఫిబ్రవరి 21:** ప్రజా నేత, సేవా దృక్పథం కలిగిన వ్యక్తి ఝాన్సీ రెడ్డి పై ఎర్రం రెడ్డి తిరుపతిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అమీజ్ పేర్కొన్నారు.శనివారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడారు.అమీజ్ మాట్లాడుతూ.పాలకుర్తి నియోజకవర్గ సేవలో తరిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి పై ఎర్రం రెడ్డి తిరుపతి రెడ్డి అమెరికాలో కూర్చొని అవాకులు చవాకులు పేలడం మానుకోవాలన్నారు. ప్రజలతో ఎలాంటి సంబంధాలు లేని ఎర్రం రెడ్డి ప్రజా నేతపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డిలు బండికి రెండు ఇరుసుల్లా మారి నిస్వార్థంగా పాటుపడుతున్నారని పేర్కొన్నారు.మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోవడం జీర్ణించుకోలేని గులాబీ నేతలు ఎర్రం రెడ్డిని ఉసిగొలుపుతున్నారని, తాటాకు చప్పులకు కాంగ్రెస్ పార్టీ, ఝాన్సీ రెడ్డి భయపడబోదన్నారు. రాజకీయాల్లోకి రాకముందే ప్రజాసేవలో ఉన్న ఝాన్సీ రెడ్డి పై విమర్శలు చేసే అర్హత ఆయనకు లేదన్నారు.దమ్ముంటే ప్రజా క్షేత్రంలో తెల్చుకోవాలని, అమెరికాలో కూర్చుని పాప్ కార్న్ తినుకుంటూ టైం పాస్ వీడియోలు పెడితే ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపాలెం వార్డు సభ్యుడు ధర్మారపు ప్రవీణ్, ధర్మారపు రాంమల్లు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.





## ఉద్యమకారుల తరుపున ధన్యవాదాలు

**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 21:** తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో పెట్టిన హామీని ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు ఇండ్లు ఉద్యమకారులను గుర్తించడానికి నెల రోజుల్లో సబ్ కమిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పిసిసి మహేష్ గౌడ్ కి బీసీ సంక్షేమ శాఖ మంత్రులు పొన్నం ప్రభాకర్ కి తెలంగాణ ఉద్యమకారుల ద్వారా బొడ్డుపల్లి లింగయ్య వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ గత కొన్ని సంవత్సరాల నుండి గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వలన కాంగ్రెస్ ప్రభుత్వం వలన ఉద్యమకారులను గుర్తించి వారికి ఇండ్లు ఇళ్ల స్థలాలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని బొడ్డుపల్లి లింగయ్య రామన్నపేట విలేకరుల సమావేశంలో వారికి హర్షం వ్యక్తం చేశారు ఇట్లు బొడ్డుపల్లి లింగయ్య తెలంగాణ ఉద్యమ నాయకుల రామన్నపేట

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం




**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 21:** తేదీ 21 -02- 2026 శనివారం రోజున రామన్నపేటలోని శ్రీ హిందూ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ డా. పనకంటి భాస్కర్ రావు మాట్లాడుతూ మన మాతృభాష అయినా తెలుగును కాపాడుకున్నప్పుడే మన దేశం మానుగడను కాపాడుకోగలమని తీయనైన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని దీనికోసం ప్రతి ఒక్కరూ కృషి చేయవలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డి శ్రీదేవి చేపూరి సతీష్ కుమార్ లింగస్వామి సునీల్ కుమార్ శివకుమార్ వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు..!



**తొలి అక్షరం/మిర్యాలగూడ/ ఫిబ్రవరి 19:** వేములపల్లి లో పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలని, కొత్తగా తీసుకొచ్చిన యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నల్గొండ జిల్లా వేములపల్లిలో రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. కోపరేటివ్ సొసైటీ ముందు నార్కెట్పల్లి అద్దంకి రహదారిపై వేములపల్లి మండల పరిధిలోని గ్రామాల రైతులు రోడ్డుపై బైటయించారు. యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసేందుకు తమ వద్ద స్మార్ట్ ఫోన్లు లేవని దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం సరైన రీతిలో యూరియా సరాపర చేయడం లేదని విమర్శించారు. ఏవో కిషోర్ నాయక్, ఏఈఓ నితిన్, ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చ చెప్పారు.

## దోమల నివారణకు ప్రత్యేక చొరవ చూపుతున్న సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి



**తొలి అక్షరం :వలిగొండ, ఫిబ్రవరి, 21:** దోమల నివారణ కోసం, ప్రత్యేక శ్రద్ధ చూపడంతో, వలిగొండ పట్టణ ప్రజలు, సంతోషం వ్యక్తం చేస్తున్నారు వాడవాడలా గాలి పొగతో, బైకుపై తిరుగుతూ, పొగ చేత దోమల నివారణ, జరుగుతుంది కావున, ముందస్తుగా డెంగ్యూ మలేరియా, రాకుండా ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సర్పంచ్ వెంకట పాపిరెడ్డి.

## ప్రజా గ్రంథాలయంలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు

- భీమదేవరపల్లి సర్పంచ్ మాచర్ల కుమారస్వామి






అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని భీమదేవర పల్లి ప్రజా గ్రంధాలయంలో జడ్ పి హెచ్ ఎస్, కే జి బి వి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా దాతలు విరాళాలుగా ఇచ్చిన పుస్తకాలని గ్రంధాలయానికి అందజేయడం జరిగింది. విరాళం ఇచ్చిన దాతలుశాంత బయోటిక్స్ ఎండి వరప్రసాద్ రెడ్డి కి ఇతరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల కుమారస్వామి మాట్లాడుతూ మాతృభాషలపై పట్టు ఉంటే మాత్రమే ఇతర భాషలపై పట్టు సాధిస్తామని అందుకోసం మన మాతృభాష అయిన తెలుగులో ప్రావీణ్యత సంపాదించుకోవాలని తద్వారా మాత్రమే ఇతర భాషలపై పట్టు సాధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రేమలత,లలిత,సంధ్య,శ్యామ్,వెంకటేశ్వర్లు,అశోక్, జడ్ పి హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి,ప్రైమరీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు రామకృష్ణ,మోహన్, సి ఆర్ పి శ్రీకాంత్,వాగు శివాజీ,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## యువ నాయకత్వానికి గుర్తింపు

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఆకాష్ నాయక్ ఎన్నిక
- విద్యార్థి హక్కుల కోసం విస్తృతంగా పోరాటం కొనసాగిస్తా.ఆకాష్ నాయక్



**తొలి అక్షరం/షాద్ నగర్,ఫిబ్రవరి 21:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థి ప్రతినిధులు, నాయకులు పాల్గొని మహాసభలు విజయ వంతం చేశారు. మహాసభల సందర్భంగా నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శిగా సేవలందిస్తున్న ఆకాష్ నాయక్‌ను ఆయన చేసిన నిరంతర కృషి, విద్యార్థి సమస్యలపై చురుకైన పోరాటాలను గుర్తించి రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ...తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ మరియు రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం, ఫీజుల భారం తగ్గింపు వంటి అంశాలపై మరింత చురుకుగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ఆయన ఎన్నిక పట్ల రంగారెడ్డి జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. యువ నాయకత్వంతో రాష్ట్రంలో విద్యార్థి ఉద్యమాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## అర్హులైన వితంతువులకు దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

- అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ పుల్ల మల్లయ్య.



**తొలి అక్షరం/చిట్యాల ఫిబ్రవరి 21:** దేశ రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన వితంతువులకు వికలాంగులకు (దివ్యాంగులు) సరియైన ఇల్లు తిండి లేక నానా ఇబ్బందులు పడుతున్నారని వారి అవాస్తలను గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులైన వారికి కొత్త పింఛన్ల తో పాటు ఇందిరమ్మ ఇండ్లు వివిధ సంక్షేమ పథకాలు మంజూరు చేసి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్యలి కోరారు. అనర్హులకు పింఛన్లు ఇచ్చి అర్హులకు ఇవ్వకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు దుర్భరమైన జీవితాలను గడుపుతున్న వీరిలో ఎక్కువ నిరుపేదలు దళితులు ఉన్నారన్నారు. అర్హులైన దివ్యాంగులకు వితంతువులకు పింఛన్లతో పాటు వివిధ సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అన్నారు.

## అమ్మ ప్రేమ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులకు పెళ్లిరోజు సన్మానం

- ప్రజాసేవలో నిలిచిన దంపతులకు దైవ సేవకుల ఘనాభినందన



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఫిబ్రవరి 21:** రాజుల కొత్తపల్లి చర్చిలో ఆదివారం హృద్యమైన కార్యక్రమం జరిగింది. పేద పిల్లలు, అనాథలు, పేద వృద్ధులకు కొంతకాలంగా నిరంతర ప్రజాసేవ అందిస్తున్న “అమ్మ ప్రేమ స్వచ్ఛంద సేవా సంస్థ” వ్యవస్థాపక దంపతులను వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా సన్మానించారు. సేవా భావంతో ముందుకు సాగుతున్న వారి కృషిని క్రీస్తు సేవకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజుల కొత్తపల్లి చర్చి దైవ సేవకులు జె.వి. రత్నం పాస్టర్, నోవాహు ఏలియా ఏకమూర్తి మరియు మరికొంతమంది పాస్టర్లు పాల్గొన్నారు. దంపతుల సేవా తపనను కొనియాడుతూ శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ, సమాజంలోని అణగారిన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఈ దంపతులు అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ప్రేమ, కరుణ, సేవ అనే క్రైస్తవ మౌలిక విలువలను వారు ఆచరణలో చూపుతున్నారని అన్నారు.

## వైద్య పరీక్షలు చేయించుకున్న ఎమ్మెల్యే



**తొలి అక్షరం/దంతాలపల్లి ఫిబ్రవరి 21:** దంతాలపల్లి మండలం రామానుజపురములో శనివారం డోర్నకల్ ప్రభుత్వ వీపు శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ పర్యటిం చారు సర్పంచ్ అక్కిరెడ్డి దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా డాక్టర్ రామచంద్రనాయక్ స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు అనంతరం గ్రామంలో నూతన అంగన్వాడీ భవనం మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు గ్రామల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు

## షాద్‌నగర్ చైర్మన్ అగ్గనూరు బసవం.. వైస్ చైర్మన్ అందే మోహన్‌కు పెన్షనర్ల సంఘం సన్మానం



**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 21:** ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో ఘన విజయం సాధించిన మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన అగ్గనూరు బసవం, వైస్ చైర్మన్ అందే మోహన్, రెండో వార్డ్ కౌన్సిలర్ బచ్చలి నరేష్, 25 వార్డు కౌన్సిలర్ పెంటయ్య షాద్ నగర్ పెన్షనర్స్ సంఘ భవనంలో రామరావు అధ్యక్షతన పెన్షనర్స్ సంఘ సభ్యుల సమక్షంలో ఘనంగా సత్కరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రామారావు అధ్యక్షులు, షరాబు జగదీశ్వర్ జిల్లా అధ్యక్షులు, సత్య నారాయణ జిల్లా ప్రధాన కార్యదర్శి ,శ్రీ నందిగామ సురేష్ కుమార్ షాద్నగర్ ప్రధాన కార్యదర్శి,శ్రీ సుధాకర్ రెడ్డి కోశాధికారి,కార్యవర్గ సభ్యులు శ్రీ మూలే జనార్ధన్,శ్రీ బిశ్వ కృష్ణయ్య,శ్రీ మందారం నరసింహులు, ఈశ్వరయ్య, రంగరాజకుమార్, శ్రీ వెంకటరమణశ్రీమతి శ్యామల,శ్రీమతి విజయలక్ష్మి, పెద్దలు శ్రీ గోపాలరావు స్వరాజ్ బాబు తదితరులు పాల్గొని కార్యక్రమాన్నీ విజయవంతం చేశారు,ఈ సందర్భంగాఅగునూరు బసం, అందే మోహన్ మాట్లాడుతూ పెన్షనర్స్ దీవెనలు ఉండాలని, షాద్ నగర్ పట్టణాన్ని మీ యొక్క సలహాలు సూచనలు తో ఇంకా సుందరంగా తీర్చిదిద్దుతామని, సభాముఖంగా తెలుపడం జరిగింది, అలాగే ఏ సమస్య ఉన్న పెన్షనర్స్ ఒక ఫోన్ కాల్ చేస్తే ఆ సమస్య పరిష్కరించడంలో ముందు ఉంటామని సభికుల హర్షధ్వనాల మధ్య ప్రకటించడం జరిగింది.


# చిన్నారి పులి సుప్రియను ఆశీర్వదించిన చిన్న కోర్పోల్ గ్రామ సర్పంచ్ భానోతు అనిత- బద్రి నాయక్



**తొలి అక్షరం/నెక్కొండ ఫిబ్రవరి 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చిన్నకోర్పోల్ గ్రామానికి చెందిన పులి స్వప్న- రంజిత్ ల కూతురు సుప్రీయ ఓనీల ఫంక్షన్ లింగగిరి ఫంక్షన్ హాల్ లో జరగగా ఓనిల ఫంక్షన్ కు హాజరైన చిన్న కోర్పోల్ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు మరియు సర్పంచ్ బానోతు అనిత–బద్రు నాయక్, ఉపసర్పంచ్ తొగరు వెంకన్న, కారో బార్ పిట్టల రాజ్ కుమార్, చింతల వేణుగోపాల్ గౌడ్, భానోత్ మోహన్, కొయ్యడ అశోక్, భుక్య హరిలాల్ మరియు ఇతరులు పాల్గొన్నారు.

# రైతులు ఎవరు అధైర్య పడవద్దు

- కావలసినంత యూరియా అందుబాటులో ఉంది
- ఏజాజ్ అలీ ఖాన్ మండల వ్యవసాయ అధికారి రామన్నపేట



**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 21:** రామన్నపేట మండల వ్యాప్తంగా రైతులు ఎవరు అధైర్య పడవద్దు అని కావలసినంత యూరియా అందుబాటులో ఉంది మండల వ్యవసాయ కార్యాలయంలో కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన రైతులు యూరియా పై వినతి పత్రం అందజేసినారు రైతులకు యూరియా గోదాం నిల్వల్లో ప్యాకింగ్ చేసేటప్పుడు చివరి భాగంలో ఉంటే ఒకటి రెండు బస్తాల్లో మట్టి రేణువులు వచ్చినాయి అని రైతులు తమ దృష్టికి తీసుకొని వచ్చారు. రైతులు అధైర్య పడవద్దు అని అలా ఉన్న బస్తాలను తిరిగి సంబంధిత డీలర్ ను సంప్రదించి నూతన యూరియా బస్తాలను తీసుకోవాలని యూరియా అనేది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా రైతులకు అందిస్తున్న ప్రథమ పోషక మని యూరియాను కల్తీ చేసే అవకాశాలు ఎట్టి పరిస్థితుల్లో ఉండవని తెలిపినారు మండల వ్యాప్తంగా ఉన్న రైతులు ఎవరు అధైర్య పడవద్దు అని ప్రతిరోజు కావలసినంత యూరియా అందుబాటులో ఉంటుంది అని తెలిపినారు

# పంతులు తండాలో పశువులకు వింత వ్యాధికి వైద్యం

- వెంటనే స్పందించిన అలంకాని పేట వైద్య సిబ్బంది



**తొలి అక్షరం/నెక్కొండ ఫిబ్రవరి 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చిన్న కోర్పోల్ గ్రామ పంచాయతి పరిధి పంతుల్ తండాలో పశువులకు తెలియని ఇంత వ్యాధి సోకడంతో వెంటనే మా యొక్క క్లస్టర్ అయిన అలంకానిపేట వైద్య సిబ్బందికి కాల్ చేసి వైద్యులకు సంప్రదించిన భానోత్ మోహన్ ం/శీ రాములు, సహకారంతో పశువులను సరైన టీకాలు వేయించడం జరిగింది. ఇందువల్ల పశువుల వ్యాధి మరింత సోకకుండా తగిన చర్యలు తీసుకోవచ్చని డాక్టర్ సలహాలు ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా గూగులోతు లాల్ సింగ్, మరియు తండా వాసుల యొక్క పశువుల వ్యాధి గురించి తెలుసుకున్న డాక్టర్లు వెంటనే స్పందించినందుకు వారికి భానోత్ మోహన్ కృతజ్ఞతలు తెలియపరచడం జరిగింది.

# షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం




**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 21:** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మాతృభాష ఔన్నత్యంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పాలాది శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాతృభాష ప్రాముఖ్యతను చాటిచెప్పేలా పలువురు ప్రసంగించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ పాలాది శ్రీనివాసులు మాట్లాడుతూ.. మనిషి ఎన్ని భాషలు నేర్చుకున్నప్పటికీ, మాతృభాషకు ఉండే గౌరవం, స్థానం వేరని పేర్కొన్నారు. "తెలుగు భాష తేనె, కండచక్కెర వలె తియ్యనైనది.. మలయ మారుతం వలె చల్లనైనది" అని చక్కని పద్యంతో ఆయన భాషా సౌందర్యాన్ని వివరించారు.తెలుగు అధ్యాపకులు డా. రవి ప్రసాద్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకోవడానికి గల చారిత్రక కారణాలను, ఈ ఉత్సవం యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. మనిషి ఉనికిని, సంస్కృతిని చాటడంలో భాష కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఐ.క్యూ.ఎ.సి. కోఆర్డినేటర్ డి. దేవయ్య మాట్లాడుతూ.. తెలుగు భాషకు ఉన్న ప్రాచీనతను గుర్తుచేశారు. ప్రాకృత కావ్యమైన 'గాథా సప్తశతి'లో తెలుగు పదాలు కనిపిస్తాయని, ఇది మన భాషా వైభవానికి నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు జి. విష్ణు, సి. సౌజన్య, ఎం. ప్రియాంక, పి. వైష్ణవి, పి. నిఖితలు మాతృభాష గొప్పదనం గురించి ప్రసంగించారు. మరికొందరు విద్యార్థులు కవితలు చదివి, పాటలు పాడి భాషాభిమానాన్ని చాటారు. అకడమిక్ కోఆర్డినేటర్ డా. సి. శాంతి, అధ్యాపకులు డా. జయ కాగడ, డా. పి. సత్యనారాయణ, డా. కె. అనురాధ, బి. యాద య్య, బి. అరుణ, చామంతి, సుష్మిత, మురళిగుప్త, స్వాతిలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# మండల బి.ఆర్.ఎస్ నాయకులు దాసరి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్



**తొలి అక్షరం/నెక్కొండ ఫిబ్రవరి 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో బి ఆర్ఎస్ నాయకులు దాసరి శ్రీనివాస్( హచ్) పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న నెక్కొండ మాజీ ఎంపీపీ గటిక.అజయ్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ వేడుకలు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు సంఘాని.సూరయ్య , సీనియర్ నాయకులు వీరస్వామి , కారింగుల సురేష్ గౌడ్ , మాజీ ఉపసర్పంచ్ వీరభద్రం , ఆంధ్రజ్యోతి రిపోర్టర్ గిరగాని శ్రీనివాస్ , వార్తా రిపోర్టర్ డెక్క సాయికుమార్ ,సూలం సారయ్య , మూసిన మాధవ్ గారు, సంపత్ , జితేందర్ రెడ్డి గారు, బొల్లెపెల్లి శ్రవణ్ , వినోద్ , ఈదునూరి దిలీప్ , రాపాక . వీరన్న గారు , సుభాష్ , ఎండి పాషా అభి యాదవ్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పూర్తి అయిన పదవ తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన

- ప్రధానోపాధ్యాయులు అక్కినేపల్లి సతీష్ కుమార్



**తొలి అక్షరం/పర్వతగిరి ఫిబ్రవరి 21:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని విజ్ఞాన భారతి విద్యాలయం చింత నెక్కొండ లో మార్చిలో జరగనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పాఠశాల స్థాయిలో కేటాయించిన ఇంటర్నల్ మార్కుల పరిశీలన కార్యక్రమం మొదలైంది. ఒక్కో సబ్జెక్టులో 20 మార్కులకుగాను విద్యార్థులు పొందిన మార్కులను పరిశీలించేందుకు విషయ నిపుణుల బృందం విద్యా భారతి విద్యాలయం లో చింత నెక్కొండ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అంజయ్య సార్,విషయ నిపుణులు హిందీ సతీష్ కుమార్ సార్, మాస్, సైన్స్ రాములు సర్ తో కూడిన బృందం మండలంలోని విజ్ఞాన భారతి విద్యాలయంలో ఇంటర్నల్ మార్కులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చింత నెక్కొండ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజయ్య సార్, హిందీ సతీష్ కుమార్ సార్ సైన్స్ అండ్ మ్యాస్ రాములు సర్ పాఠశాల ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శవం మెడలోని బంగారం కూడా వదలని దుండగులు

- రెండు తులాల చైన్ అపహరణ
- గంటల్లోనే కేసు ఛేదించిన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పోలీసులు
- ఇద్దరు నిందితులు అరెస్ట్ బంగారం స్వాధీనం



**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 21:** మానవత్వానికే మచ్చ తెచ్చే సంఘటన చోటు చేసుకుంది.రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి శవం మెడలో ఉన్న బంగారు చైన్‌ను దొంగిలించిన ఇద్దరు దుండగులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రెండు తులాల బంగారు చైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం...తుర్కయాంజల్‌కు చెందిన పుల్లగుర్రం పురుషోత్తం రెడ్డి తీర్థయాత్ర నుంచి తిరుగు ప్రయాణంలో బూర్గుల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ నెల 17న మృతిచెందాడు.మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లి పరిశీలించగా, మెడలో ఉన్న బంగారు చైన్ కనిపించకపోవడంతో అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.విశ్వసనీయ సమాచారం మేరకు కడియాల కుంట తండాకు చెందిన మూడవత్ లోక్య నాయక్, శాఖాపూర్‌కు చెందిన గోదా రవికుమార్ గౌడ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. ప్రమాద స్థలానికి వెళ్లి శవాన్ని తరలించే సమయంలో చైన్ దొంగిలించి అమ్ముకోవాలనే ఉద్దేశంతో దాచుకున్నట్లు వెల్లడించారు.వీరిలో ఒకరు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాలో లేబర్‌గా పనిచేస్తుండగా,మరొకరు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుల వద్ద నుంచి రెండు తులాల బంగారు చైన్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసు దర్యాప్తు డీసీపీ సి హెచ్ శిరీష, ఏసీపీ ఎస్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో, సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. కేసు ఛేదనలో పాల్గొన్న క్రైమ్ సిబ్బందికి రివార్డులు అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తా...

- కందిమల్ల గోపాల్ రెడ్డి సర్పంచ్ నీర్నంల







**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 21:** రామన్నపేట మండలం నీర్నంల గ్రామంలో సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి ఆదేశాల ప్రకారం జెసిపి సహకారంతో ప్రతి వార్డులో ఉన్న చెత్తను తొలగించడం జరిగినది వార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి శుభ్రం చేయించడం జరిగినది ఆయా వార్డు ప్రజలకు వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగినది

# బిజెపి నాయకుని అరెస్టు



**తొలి అక్షరం/రామన్నపేట ఫిబ్రవరి 21:** ఇండియా ఎక్స్పోలో భారత మండపంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేసి భారత ప్రధాని నరేంద్ర మోడీని అవమానించడానికి నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీ భవన్ ముట్టడికి భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో పిలుపునివ్వగా ముందస్తుగా రామన్నపేట మండల కేంద్రానికి చెందిన యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి సైదులు ముందస్తుగా అరెస్టు చేసి రామన్నపేట పోలీస్ స్టేషన్కు తరలించడం జరిగింది

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్



**తొలి అక్షరం/నెక్కొండ ఫిబ్రవరి 21:** వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణ కేంద్రంలో వడ్డే మౌనిక- సంతోష్ లు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమనికి హాజరైన నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సింగం ప్రశాంత్,సీనియర్ నాయకులు చల్లా పాపిరెడ్డి, రగోత్తమరెడ్డి,వార్డుసభ్యులు మధుకర్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ నాయకులు రామారపు రాము, వడ్డే సూర్యనారాయణ, బొమ్మరబోయిన రమేష్, కృష్ణ రావు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి పులి సుప్రియను ఆశీర్వదించిన చెరువు ముందు తండా సర్పంచ్ కున్సోత్ మంగమ్మ- శ్రీనివాస్

**తొలి అక్షరం/నెక్కొండ ఫిబ్రవరి 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలము చిన్నకోర్పోల్ గ్రామానికి చెందిన పులి రంజిత్ – స్వప్న ల కుమార్తె సుప్రియ సారి పంక్షన్ కు హాజరై ఆశీర్వదించిన చెరువు ముందరి తండా గ్రామ సర్పంచ్ కునుసోతు మంగమ్మ– శ్రీను,ఉప సర్పంచ్ మూడు మంగమ్మ –రాజేందర్, వార్డ్ మెంబర్ గుగులోతు సరోజ , పాల్తియ శంకర్, మూడు జాని , ఆంగోతు లలిత, గుగులోతు కవిత, లలిత, శ్రీనివాస్ , బానోతు సరిత, జంపాల వెంకన్న, ఆత్మకూరి శ్రీనివాస్ ఎల్ ఐ సి , పడాల రాజు కుమార్, గై సంపత్ , గజ్జల సంపత్ , గోపాల్,ఆత్మకూరి శ్రీను, సతీష్‌లు పాల్గొన్నారు.



# రైతు అనుమతి లేకుండానే ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు?

**దొంగ పత్రాలతో ఎలా అనుమతులుడ అధికారుల పాత్రపై అనుమానాలు**

**ఏఈ ఆదేశాలతోనే విద్యుత్ కనెక్షన్ అంటూ రైతు ఆరోపణ**

**న్యాయం చేయాలని సత్యనారాయణ రెడ్డి ఆవేదన**






**తొలి అక్షరం/షాద్ నగర్,ఫిబ్రవరి 21:** షాద్‌నగర్ పరిధిలో లీజు భూమి వివాదం తీవ్ర చర్చకు దారి తీసింది. ఫరూక్ నగర్ మండలం రాయికల్ శివారులో జాతీయ రహదారి పక్కన ఉన్న వ్యవసాయ భూమిలో రైతు అనుమతి లేకుండానే ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటన స్థానికంగా ఉద్రిక్తతకు దారి తీస్తోంది. **లీజు ఒకటి... వినియోగం మరొకటి?** రైతు సత్యనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...తన భూమిని "ఆహారా రెస్టారెంట్" నిర్వహణ కోసం పదేళ్ల కాలానికి లీజుకు ఇచ్చారు. ఒప్పందం ప్రకారం కేవలం రెస్టారెంట్ కార్యకలాపాలే చేపట్టాల్సి ఉండగా, లీజుదారు అదనంగా ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను మరో వ్యక్తికి సబ్‌లీజ్ ఇచ్చినట్లు ఆరోపిస్తున్నారు. ఇది ఒప్పందానికి విరుద్ధమని రైతు వాదిస్తున్నారు. **అనుమతుల్లో గందరగోళం?** ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కోసం విద్యుత్ శాఖకు సమర్పించిన పత్రాల్లో గందరగోళం ఉన్నట్లు తెలుస్తోంది. పట్టా పాస్‌బుక్ ఒకరి పేరుతో, ఆధార్ కార్డు మరొకరి పేరుతో, పాన్ కార్డు ఇంకొకరి పేరుతో, లీజ్ అగ్రిమెంట్ వేరొకరి పేరుతో ఉన్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో విద్యుత్ అనుమతులు ఎలా మంజూరయ్యాయన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. **రైతు లేని సమయంలోనే ఏర్పాటు?** తాను అక్కడ లేని సమయంలోనే విద్యుత్ శాఖ సిబ్బంది ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసి వెళ్లారని రైతు ఆరోపిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోయిందని వాపోయారు. **లైన్మెన్‌కు ఆన్ చేయాల్సిందే.. ఏఈ ఆదేశం?** ట్రాన్స్ఫార్మర్ ఆన్ చేయడాన్ని రైతు అడ్డుకుంటున్నాడని లైన్‌మెన్ ద్వారా సమాచారం అందడంతో, ఏఈ షణ్ముఖ రెడ్డి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్ చేయాలి అంటూ ఆదేశాలు ఇచ్చినట్లు రైతు చెబుతున్నారు. దీంతో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. న్యాయం కోరుతున్న రైతు నా భూమిడ నా అనుమతి లేకుండా విద్యుత్ సదుపాయం ఎలా ఏర్పాటు చేస్తారు? అంటూ రైతు సత్యనారాయణ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. పైస్థాయి అధికారులు జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ జరిపి న్యాయం చేయాలని మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనతో లీజు ఒప్పందాలు, విద్యుత్ అనుమతుల మంజూరులో పారదర్శకతపై స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి స్పష్టత ఇవ్వాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఏఈ వివరణ కోరెందుకు మీడియా ఫోన్ చేయగా స్పందించడం లేదు. దీనిపై ఉన్నత అధికారులు ఏ విధంగా చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే..

# సీలింగ్, భూదాన్ భూములపై రియల్ ఎస్టేట్ దందా




**వెలి జర్లలో చట్టాలను తుంగలో తొక్కుతున్న వ్యాపారులు**

**అధికారుల నిర్లక్ష్యం... రైతుల్లో ఆందోళన**

**నిషేధిత జాబితాలో ఉన్న భూములపై అక్రమ అగ్రిమెంట్లు**

**సీలింగ్ భూములను మాయం చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు**

**తొలి అక్షరం/షాద్ నగర్, ఫిబ్రవరి 21:** ఫరూక్ నగర్ మండలం పరిధిలోని వెలి జర్ల గ్రామంలో సీలింగ్, భూదాన్ భూముల వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది. రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు చట్టాలను బేఖాతరు చేస్తూ అక్రమ భూ దందాకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో సర్వే నంబర్లు 6/18ఇ, 6/18ఈ పరిధిలో దాదాపు 9 ఎకరాల సీలింగ్ భూమి ఉన్నప్పటికీ, వాటిని విక్రయించడం లేదా అగ్రిమెంట్లు చేయడం పూర్తిగా చట్టవిరుద్ధం. అయినప్పటికీ కొందరు వ్యాపారులు రైతుల వద్ద నుంచి 5 నుంచి 20 ఎకరాల వరకు భూములను అగ్రిమెంట్లు చేసుకుని, వాటిని పట్టాలుగా మార్చుకునేందుకు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. స్థానికుల ఆరోపణల ప్రకారం... కబ్జాలో ఉన్న వారిని బెదిరింపులకు గురిచేసి, తప్పుడు పత్రాలు సృష్టించి, సీలింగ్ భూములను వెంచర్లుగా మార్చి ప్లాట్లుగా విక్రయిస్తూ కోట్ల రూపాయలు గడించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. సీలింగ్ భూ యజమానులకు నయానో, భయానో భూములను స్వాధీనం చేసుకుని భూములను చదును చేసుకొని, చుట్టూ పెన్షన్లు వేసి కబ్జా చేసుకుంటున్నారు. మరో విచిత్రం ఏమిటంటే ....సంవత్సరాల తరబడి అధికారుల చుట్టూ తిరిగినా పట్టా మార్పులు జరగకపోగా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు రంగంలోకి దిగగానే అదే భూములు తక్కువ కాలంలో పట్టాలుగా మారిపోతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ ప్రక్రియలో అధికారుల కనుసంధి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో మండల అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో రైతుల్లో పలు అనుమానాలు పెరుగుతున్నాయి. ఎమ్మార్వోకు ఫిర్యాదు చేయడంతో...వీఆర్వో సంఘటన స్థలానికి వెళ్లి వేడుక చూసినట్టు చూసి వెళ్లిపోవడంతో పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఈ విషయంపై ఎమ్మార్వో నాగయ్యను వివరణ కోరగాడ సీలింగ్ భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని, ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత రైతులు సీలింగ్ నుంచి పట్టా మార్పిడి కోసం దరఖాస్తులు చేసుకున్నారని వెల్లడించారు. అయితే గ్రామస్తులు మాత్రం వెంటనే అక్రమాలపై దర్యాప్తు జరిపి, అక్రమ కొనుగోలును రద్దు చేసి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని పేద రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

**- గ్రామాలలో సర్పంచ్‌లు సుపరిపాలన అందించాలి**

**- ఆర్థిక సంఘం నిధులతో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు**

**- డి.పి.ఆర్.సి. సెంటర్‌లో నూతన సర్పంచ్ లకు ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**తొలి అక్షరం/ఖమ్మం ఫిబ్రవరి 21 :** గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. డి.పి.ఆర్.సి. సెంటర్ లో నూతన సర్పంచ్ లకు ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ లకు పెద్ద బాధ్యత ఉంటుందని, రాబోయే 5 సంవత్సరాల పాటు బాధ్యత బాగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. సర్పంచ్ విధి నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలు, కార్యచరణపై ఫిబ్రవరి 17 నుంచి 21 వరకు 5 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందించడం జరిగిందని అన్నారు. పంచాయతీ కనీస బాధ్యతలు కట్టుదిట్టంగా నిర్వహిస్తే, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తారని కలెక్టర్ అన్నారు. గ్రామ పారిశుధ్యం పరిశీలించి గ్రామ సర్పంచ్, పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి పనితీరు చెప్పవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు చెత్త సేకరణ సజావుగా జరుగుతుందా, పారిశుద్ధ్య నిర్వహణ ఎలా ఉంటుంది అనే అంశాన్ని సర్పంచ్ పర్యవేక్షించాలని అన్నారు. గ్రామాలలో పచ్చదనం పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. గ్రామ అభివృద్ధి పనులు ప్రణాళిక ప్రకారం చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ దగ్గర అందుబాటులో ఉన్న నిధులు ఎలా ఖర్చు చేయాలో పటిష్ట కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని అన్నారు. పంచాయతీ పాలక వర్గం సమావేశాలు రెగ్యులర్ గా నిర్వహించి తీసుకున్న నిర్ణయాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. గ్రామ సర్పంచ్ లు అధికారులతో సమన్వయంతో పని చేస్తూ గ్రామసమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని, సర్పంచ్ గా గెలిచిన తర్వాత గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పని చేస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. గ్రామాలలో పన్ను వసూలుపై సర్పంచ్ శ్రద్ధ పెట్టాలని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పన్ను కట్టేలా ప్రజలను ప్రోత్సహించాలని, పన్ను ఎగవేత ఎట్టి పరిస్థితుల్లో సహించ వద్దని, పాత పన్ను బకాయిలు కూడా వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. మన గ్రామాలను దేశంలో అత్యుత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దుతూ జాతీయ స్థాయి అవార్డులు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పంచాయతీ పాలనపై సర్పంచ్ పట్టు సాధిస్తే అభివృద్ధి మరింత మెరుగ్గా సాధ్యం అవుతుందని అన్నారు. ఆర్థిక సంఘం నిధులు 33 కోట్ల రూపాయలు జిల్లాలో గ్రామ పంచాయతీ లలో జమ అయ్యాయని, వీటిలో 20 కోట్ల రూపాయలు గ్రామాలలో పారిశుద్ధ్య, పంచాయతీ సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు వంటి టైడ్ గ్రాంట్ నిధులు, 13 కోట్ల రూపాయలు అభివృద్ధి నిధులు ఉన్నాయని, మార్చి 31 వరకు మరిన్ని నిధులు జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఆర్థిక సంఘం నిధులను దుబారా చేయకుండా సక్రమంగా వాడుకునేందుకు గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణం మాత్రమే అభివృద్ధి కాదని, గ్రామాలలో మెరుగైన పారిశుద్ధ్యం, పచ్చదనం పెంచడం వంటి పనులు కూడా అభివృద్ధి అవుతాయని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ప్రభుత్వ పథకాల అమలు తీరు కూడా సరిగా అవుతుందో లేదో దృష్టి పెట్టాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి రాంబాబు, అధికారులు, గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు రైతులకు మేలు

**• ఆయిల్ పామ్ సాగు పై రైతులకు అవగాహన సదస్సు**






**తొలి అక్షరం/పెనుబల్లి, ఫిబ్రవరి 21:** ఆయిల్ ఫామ్ సాగు రైతులకు లాభసాటిధి అని ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలం పరిధిలో అగ్రహారం గ్రామంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉద్యానవనశాఖ అధికారి నగేష్ అధ్యక్షతన రైతులకు ఆయిల్ పామ్ సాగు పై అవగాహన సదస్సు ను ఏర్పాటు చేశారు. ఈ సదస్సు కు ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఐ వి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సంప్రదాయ పంటలైన పత్తి, మిరప, వరి పంటలు కాకుండా, ఒకసారి నాటితే 30 సంవత్సరాల వరకు ఆదాయం ఇచ్చే ఆయిల్ పామ్ పంట వేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ పంట కి కోతుల బెడదా తక్కువగా ఉంటుందని, ప్రకృతి వైపరీత్యాల నుండి తట్టుకుంటుంధని అన్నారు. రైతులకు అందుబాటులో ఆయిల్ ఫామ్ సాగు కు మార్కెట్ సదుపాయం ఉన్న పంట అని తెలిపారు. ఆయిల్ పామ్ లో చేపట్టాల్సిన ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, చీడ, పీడ ల యాజమాన్యం గురించి రైతులకు వివరించినారు. ఈ కార్యక్రమం లో ఉద్యాన అధికారి జి నగేష్, ఆయిల్ ఫెడ్ జిల్లా అధికారి శంకర్, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్స్ నాగలక్ష్మి, యుగందర్, డ్రిప్ ప్రతినిధులు టీ సుమన్, డి సురేష్, రైతులు పాల్గొన్నారు.

# భాషా వైవిధ్యం పై యువతకు చిన్ననాటి నుంచే అవగాహన కలిగి ఉండాలి: కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్




**తొలి అక్షరం/అన్నమయ్య జిల్లా: పుంగనూరు: ఫిబ్రవరి 21:** అన్నమయ్య జిల్లా పుంగనూరు పట్టణంలోని ప్రభుత్వ శుభారాం డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ భాషా వైవిధ్యానికి యువత ప్రధాన సంరక్షకులని ఆయన అన్నారు. భాషా వైవిధ్యం పై యువత చిన్ననాటి నుంచే అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సోమరాజు, షాహిదాబాను, డాక్టర్ సి.పవిత్ర, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడే గురుకులాలకు ప్రవేశ పరీక్ష: గురుకుల కళాశాల ప్రిన్సిపల్ కనకదుర్గ




**తొలి అక్షరం/కల్లూరు, ఫిబ్రవరి 21 :** తెలంగాణ ప్రభుత్వ గురుకులాల్లో ఐదవ తరగతి మరియు ఆరవ తరగతికి నుండి తొమ్మిదవ తరగతి వరకుమిగిలిన బ్యాక్లాగ్ సీట్ల కొరకై జరుపబడే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నేటి ఆదివారం 22 న నిర్వహిస్తున్నట్లు టి జి ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్, జెసి బాలికల కల్లూరు ప్రిన్సిపల్ పి.కనకదుర్గ తెలియజేశారు. ప్రవేశ పరీక్ష 22 ఫిబ్రవరి ఆదివారం న ఉదయం 11 గంటల నుండి 1గంట వరకు పరీక్ష జరగనున్నట్లు తెలియజేశారు. పరీక్ష రాసే అభ్యర్థులు పెన్ను బ్లూ లేదా బ్లాక్ పాడ్, హాల్ టికెట్ ఆధార్ తప్పనిసరిగా తీసుకొని ఉదయం 10 గంటలకల్లా పరీక్ష కేంద్రానికి రావాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలోనికి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవు అని తెలిపారు. ఇందులో బాలురు 258 మంది బాలికలు 222 మంది మొత్తం 480 మంది పరీక్ష రాస్తున్నట్లు ఆమె తెలియజేశారు. విద్యార్థులు సకాలంలో హాజరై పరీక్ష రాయాలని కోరారు.

# ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ

**• రోడ్డు ప్రమాదములో కాలు విరిగిన వ్యక్తి**




**తొలి అక్షరం/సత్తుపల్లి, ఫిబ్రవరి 21 :** మండల కేంద్రంలో సత్యం పేట గ్రామం నుంచి కూలి పని నిమిత్తం బయలుదేరిన ద్విచక్ర వాహనదారుడు తోట కృపారావు సత్తుపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న మరొక ద్విచక్ర వాహనాన్ని ఢీకొని కింద పడిపోయాడు. సమాచారం అందుకున్న సత్తుపల్లి 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్లమందల కృష్ణ, పైలెట్ ఏకాంత్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. కృపారావుకి కుడికాలు తొడ ఎముక విరిగిపోవడం తో గమనించిన సత్తుపల్లి 108 సిబ్బంది అక్కడికక్కడే కట్లు కట్టి ( ఆధునిక వైద్య విధానంలో స్ప్లింటింగ్ ) మెడ పట్టి పెట్టి, ఇంజక్షన్స్ అందిస్తూ ఆక్సిజన్ పెడుతూ, ధైర్యం చెబుతూ సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి లో చేర్పించారు. సకాలంలో స్పందించిన సత్తుపల్లి 108 సిబ్బందిని, సత్యం పేట కాకర్లపల్లి సత్తుపల్లి వాహనదారులు, ఖమ్మం జిల్లా 108 మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్, మూడు జిల్లాలను నిరంతరం పర్యవేక్షణ చేస్తున్న ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్ అభినందించారు.


# ఆస్ట్రేలియాను చిత్తు చేసిన భారత్



## 2-1తో ద్వైపాక్షిక సిరీస్ కైవసం !

### సమిష్టిగా రాణించిన టీమిండియా మహిళలు

ఆస్ట్రేలియా గడ్డపై భారత మహిళల క్రికెట్ జట్టు అద్భుతం సృష్టించింది. అడిలైడ్ ఓవల్ వేదికగా శనివారం జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియాపై 17 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుని దశాబ్దాల చరిత్ర తిరగరాసింది. దాదాపు పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియాలో ద్వైపాక్షిక సిరీస్ గెలవడం విశేషం. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 176 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా జట్టును మన బౌలర్లు తీవ్రంగా ఒత్తిడికి గురిచేశారు. కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి ఆసీస్ జట్టు 20 ఓవర్లు ముగిసేసరికి తొమ్మిది వికెట్లు కోల్పోయి కేవలం 159 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు సమిష్టి కృషితో సాధించిన ఈ అద్భుతమైన విజయం పట్ల దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచింది. భారత బ్యాటింగ్ ఇన్నింగ్స్‌లో స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన, యువ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వీరవిహారం చేశారు. ఆరంభంలోనే షఫాలీ వర్మ వికెట్ కోల్పోయిన దశలో ఈ ఇద్దరూ కలిసి ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. స్మృతి మంధాన కేవలం 55 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో చెలరేగి 82 పరుగులు సాధించి ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించింది. మరోవైపు జెమీమా రోడ్రిగ్స్ కూడా ఎంతో ధాటిగా ఆడుతూ 46 బంతుల్లో 59 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు అత్యంత కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో భారత్ భారీ స్కోరు దిశగా పయనించింది. ఆఖర్లో వరుస వికెట్లు పడినప్పటికీ, వీరిద్దరి మెరుపు ఇన్నింగ్స్‌లే టీమిండియా చారిత్రక విజయానికి బలమైన పునాది వేశాయి. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు భారత బౌలర్లు ఆరంభంలోనే కోలుకోలేని షాక్ ఇచ్చారు. యువ స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్, శ్రీ చరణి తమ స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. పవర్ ప్లే లోనే ఆస్ట్రేలియా టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చి మ్యాచ్‌ను మన ఆధీనంలోకి తెచ్చారు. ఆస్ట్రేలియా బ్యాటర్లలో ఆష్లీ గార్డ్‌నర్ (57 పరుగులు) మాత్రమే ఒంటరి పోరాటం చేసింది.



# ఇషానీ జోహార్‌తో విడాకులు తీసుకున్న రాహుల్ చాహర్

భారత క్రికెటర్ రాహుల్ చాహర్, తన భార్య ఇషానీ జోహార్‌తో విడాకులు తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. సుదీర్ఘ కాలం పాటు కొనసాగిన వీరి వివాహ బంధం ముగియడంపై రాహుల్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్ చేశారు. గత కొద్ది కాలంగా వ్యక్తిగత జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారత స్పిన్నర్ రాహుల్ చాహర్, తన వైవాహిక బంధానికి ముగింపు పలికారు. ఫ్యాషన్ డిజైనర్ అయిన ఇషానీ జోహార్‌తో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. రాహుల్ తన విడాకుల నిర్ణయం గురించి ఓ సందేశాన్ని పంచుకున్నారు. “నేను చాలా చిన్న వయసులోనే పెళ్లి చేసుకున్నాను. అప్పట్లో నన్ను నేను, నా విలువలను, జీవితం వైపు నా దిశను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను” అని రాహుల్ పేర్కొన్నారు. గత 15 నెలలుగా కోర్టు ప్రక్రియల ద్వారా వెళ్తున్న సమయంలో సహనం, నిజాయితీ ప్రాముఖ్యతను తెలుసుకున్నట్లు ఆయన వివరించారు. “నేను ఈ బంధాన్ని కోపంతోనో, విచారంతోనో ముగించడం లేదు. పూర్తి స్పష్టతతో ముందుకు సాగుతున్నాను. కొన్ని సంబంధాలు కేవలం మనకు జీవిత పాఠాలు నేర్పడానికే వస్తాయి” అని రాహుల్ రాసుకొచ్చారు. ఈ విడాకులను ఒక ముగింపుగా కాకుండా కొత్త ప్రారంభంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆత్మగౌరవం, ప్రశాంతత, భవిష్యత్తుపై స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగుతానని, తన మనసులో ఎలాంటి చేదు అనుభవాలను ఉంచుకోవాలని అనుకోవడం లేదని స్పష్టం చేశారు. రాహుల్ - ఇషానీ బంధం నేపథ్యం.. 2019లో జైపూర్ వేదికగా రాహుల్, ఇషానీ నిశ్చితార్థం జరిగింది. ఆ తర్వాత 2022లో వీరిద్దరూ ఒక్కటయ్యారు.



# ఒత్తిడిలో ఉన్న భారత్‌ను ఓడిస్తాం

### - సౌతాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి కాన్రాడ్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా.. అసలు సిసలు పోరుకు సిద్ధమైంది. సూపర్-8లో భాగంగా ఆదివారం సౌతాఫ్రికాతో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా రాత్రి 7.30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే ఈ మ్యాచ్ నేపథ్యంలో తమ కంటే భారత్‌పైనే ఒత్తిడి ఎక్కువగా ఉందని సౌతాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి కాన్రాడ్ అన్నాడు. ఈ మ్యాచ్ నేపథ్యంలో శనివారం మీడియాతో మాట్లాడిన షుక్రి కాన్రాడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్ మీదే ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని చెప్పాడు. ఒత్తిడిలో ఏ జట్టు అయినా బలహీనపడుతుందని, దాన్ని క్యాష్ చేసుకొని విజయం సాధిస్తామని పేర్కొన్నాడు.'భారత్ మీదే ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. సెమీఫైనల్స్ చేరుకునే విషయంలో టీమిండియాపైనే అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. వారు ఫైనల్‌కు కూడా చేరుకుంటారు. అయితే ఒత్తిడిలో వారు బలహీనపడుతారు. దాన్ని క్యాష్ చేసుకుంటాం. నిజానికి మా ఇరు జట్ల మీదా ఒత్తిడి ఉంటుంది. మేమంతా అత్యుత్తమ జట్టుతో మ్యాచ్ ఆడితే ఉండే ఒత్తిడి గురించి మాట్లాడుతున్నాం. నిజానికి వారు ఏ ఒత్తిడిలో ఉన్నారో తెలియదు. అభిషేక్ శర్మ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో వరుసగా డకౌట్ అయిన వ్యక్తి, జట్టులో తన స్థానం గురించి పడే ఒత్తిడి గురించి నేను మాట్లాడటం లేదు.'అని షుక్రి కాన్రాడ్ పేర్కొన్నాడు. మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ అయినా అభిషేక్ శర్మకు టీమిండియా మేనేజ్‌మెంట్ అండగా నిలుస్తోంది. అతను వరల్డ్ నెంబర్ వన్ బ్యాటర్ అని, కీలక సమయంలో తప్పకుండా ఫామ్ అందుకుంటాడని ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# అసలైన అసలైన సమరానికి తెర

### - నేడు భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య సూపర్-8 పోరు

### - అభిషేక్ శర్మ స్థానంలో జట్టులోకి సంజూ శాంసన్!




టీ20 వరల్డ్ కప్ 2026లో అసలైన అసలైన సమరానికి తెరలేచింది. ఆదివారం (ఫిబ్రవరి 22) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్, సౌతాఫ్రికా జట్లు సూపర్-8 పోరులో తలపడనున్నాయి. గత టీ20 వరల్డ్ కప్ ఫైనలిస్టుల మధ్య జరుగుతున్న ఈ మ్యాచ్ అంటే అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే, ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా తుది జట్టు (గ్రశ్రీఖిఎఅఅస్త్ర-11) విషయంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఓపెనర్ అభిషేక్ శర్మ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో సున్నాకే అవుట్ కావడంతో, అతని స్థానంలో సంజూ శాంసన్‌ను తీసుకుంటారా అన్న సందేహాలు మొదలయ్యాయి. శుక్రవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో సంజూ శాంసన్ నెట్స్‌లో చాలా సేపు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడంతో, అతను తుది జట్టులోకి వస్తున్నాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. సాధారణంగా మ్యాచ్‌కు ముందు ఎవరైతే ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తారో, వారు ప్లేయింగ్-11లో ఉండే అవకాశం ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముందు ఉంచగా, ఆయన చాలా ఆసక్తికరంగా స్పందించారు. “ఏంటి.. సంజూను ఆడించడం కోసం అభిషేక్ శర్మను తప్పించమంటారా లేక నంబర్-3లో ఆడుతున్న తిలక్ వర్మను పక్కన పెట్టమంటారా” అంటూ ఎదురు ప్రశ్న వేశారు. దీన్ని బట్టి చూస్తుంటే, టీమ్ మేనేజ్మెంట్ అభిషేక్ శర్మపైనే పూర్తి నమ్మకంతో ఉన్నట్లు అర్థమవుతోంది. జట్టు ప్రదర్శనపై వస్తున్న విమర్శలను కూడా సూర్య సున్నితంగా తిప్పికొట్టారు. “ప్రస్తుతం అంతా బాగానే ఉంది.


# అభిషేక్ శర్మ గురించి టెన్షన్ లేదు

### • టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్

టీమిండియా మ్యాచ్ అంటే చాలు స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ డకౌట్ల గురించే చర్చ జరుగుతోంది. అయితే మేనేజ్‌మెంట్ నుంచి అభిషేక్ శర్మకు కావాల్సినంత సపోర్ట్ లభిస్తోంది. అభిషేక్ శర్మ డకౌట్లపై టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ సరదాగా స్పందించాడు. తాను ఆందోళన చెందుతున్నది అభిషేక్ శర్మ ఫామ్ గురించి కాదని, ప్రత్యర్థి జట్ల గురించి ఆందోళన చెందుతున్నానని తనదైనశైలిలో బదులిచ్చాడు. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8లో టీమిండియా మొదటి మ్యాచ్ దక్షిణాఫ్రికాతో నేడు తలపడనుంది. మ్యాచ్‌కు ముందు రోజు శనివారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీ20ల్లో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను అభిషేక్ శర్మ పేలవ ఫామ్ గురించి ప్రశ్నలు అడిగారు. అభిషేక్ గ్రూప్ స్టేజ్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ డకౌట్ అయ్యాడు. అయితే ఓపెనర్ బ్యాటర్ గురించి ఎలాంటి ఆందోళన లేదని, కానీ ప్రత్యర్థి జట్ల గురించి తనకు ఆందోళనగా ఉందని కెప్టెన్ సూర్య పేర్కొన్నాడు. 'అభిషేక్ శర్మ ఫామ్ గురించి ఆందోళన చెందుతున్న వారిని చూసి నేను ఆందోళన చెందుతున్నాను. అభిషేక్ శర్మ భవిష్యత్తులో ఎవరితో ఆడబోతున్నాడో ఆ జట్ల గురించి ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తులో అతనిని ఎదుర్కోబోయే జట్ల గురించి ఎక్కువ ఆందోళనగా ఉన్నారు. గత సంవత్సరం అభిషేక్ చాలా చేశాడు. ఇప్పుడు అతనికి మేం సహకరించాల్సిన సమయం వచ్చింది' అని సూర్య మద్దతుగా నిలిచాడు. ప్రతి మ్యాచులో 250 పరుగులు చేయాల్సిన అవసరం లేదని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. వికెట్లు కొంచెం భిన్నంగా ఉన్నాయని ఆయన చెప్పారు. తదుపరి మ్యాచ్‌లలో వచ్చే పిచ్ సవాళ్లను తాము ఎదుర్కొంటామని తెలిపారు. భారత్ నెదర్లాండ్స్‌పై ఇక్కడి నరేంద్ర మోదీ స్టేడియంలోనే విజయం సాధించింది, ఇప్పుడు దక్షిణాఫ్రికాతో సూపర్-8 మ్యాచ్ కూడా అక్కడే జరగనుంది. ప్రస్తుత ఎడిషన్‌లో దక్షిణాఫ్రికా కూడా ఈ గ్రౌండ్‌లో 2 మ్యాచ్‌లు ఆడి రెండింటిలోనూ విజయం సాధించింది. టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8లో భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం జరగనుంది. నెదర్లాండ్స్ మ్యాచులో అభిషేక్ వరుసగా మూడవసారి డకౌట్ అయ్యాడు. అంతకుముందు పాకిస్తాన్, అమెరికాలపై కూడా ఖాతా తెరవలేదు. ఇప్పటివరకు టోర్నీలో ఓడిపోనప్పటికీ, ఇకనుంచి అభిషేక్ పరుగులు చేయడం జట్టుకు అవసరం. కానీ తన ఆటగాడికి కెప్టెన్ నుంచి సపోర్ట్ లభించింది.



# తొలి సూపర్ 8 మ్యాచ్ రద్దు.. షాక్‌లో పాక్, న్యూజిలాండ్..!



పొట్టి ప్రపంచకప్ సూపర్ 8 ఆరంభ పోరులో విజయంపై కన్నేసిన పాకిస్థాన్, న్యూజిలాండ్‌కు బిగ్ షాక్. వర్షం కారణంగా మ్యాచ్ ఒక్కబంతి కూడా పడకుండానే రద్దయ్యింది. టాస్ పడడమే ఆలస్యం ప్రేమదాస స్టేడియాన్ని ముంచెత్తిన వర్షం.. ఎంతకూ తగ్గలేదు. కనీసం ఐదు ఓవర్ల ఆటైనా జరిపించాలనుకున్నా సాధ్యపడలేదు. వర్షం బ్రేకివ్వకపోవడంతో నాలుగ్గంటలే వేచిచూసిన అంపైర్లు చివరకు ఆటను రద్దు చేశారు.పొట్టి ప్రపంచకప్ సూపర్ 8 ఆరంభ పోరులో విజయంపై కన్నేసిన పాకిస్థాన్, న్యూజిలాండ్‌కు బిగ్ షాక్. వర్షం కారణంగా మ్యాచ్ ఒక్కబంతి కూడా పడకుండానే రద్దయ్యింది. టాస్ పడడమే ఆలస్యం ప్రేమదాస స్టేడియాన్ని ముంచెత్తిన వర్షం.. ఎంతకూ తగ్గలేదు. కనీసం ఐదు ఓవర్ల ఆటైనా జరిపించాలనుకున్నా సాధ్యపడలేదు. వర్షం బ్రేకివ్వకపోవడంతో నాలుగ్గంటలే వేచిచూసిన అంపైర్లు చివరకు ఆటను రద్దు చేశారు.

# ఇకపైనే టీమ్‌ఇండియాకు సిసలైన పోటీ

టీ20 ప్రపంచ కప్‌లో అసలైన పోరుకు రంగం సిద్ధమైంది. 20 జట్లతో ప్రారంభమైన టోర్నమెంట్‌లో 8 టీమ్స్ మిగిలాయి. ఈ ఎనిమిది జట్ల మధ్య శనివారం నుంచి సూపర్ 8 పోరు షురూ కానుంది. గ్రూప్ దశలో భారత్ ఓటమి లేకుండా నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి తదుపరి దశకు రెడీ అవుతోంది. అయితే ఈ టోర్నీలో భారత్ ఇప్పటిదాకా పాకిస్థాన్ మినహా బలమైన జట్టును ఢీ కొట్టలేదు. కానీ, ఇకపైనే టీమ్‌ఇండియాకు సిసలైన పోటీ ఉండనుంది. సూపర్ 8లో వెస్టిండీస్, సౌతాఫ్రికా లాంటి పటిష్ఠమైన జట్లను ఢీ కొట్టాల్సి ఉంది. మొత్తం ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించి సూపర్ 8 మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ఇందులో భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే ఒక గ్రూప్‌లో ఉండగా, శ్రీలంక, న్యూజిలాండ్, పాకిస్థాన్, ఇంగ్లాండ్ ఇంకో గ్రూపులో ఉన్నాయి.



# రూమర్లపై కౌంటర్ ఇచ్చిన మీనా




తనపై వస్తున్న అనవసర రూమర్లకు ఈసారి గట్టిగానే కౌంటర్ ఇచ్చారు సీనియర్ హీరోయిన్ మీనా. చాలా కాలం పాటు దక్షిణ భారత సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగొందిన మీనా, తాజాగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుడు కథనాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే మీనా, ఈసారి మాత్రం తన సహనాన్ని పరీక్షిస్తున్నారని స్పష్టంగా చెప్పుకొచ్చారు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి, ఆపై హీరోయిన్‌గా స్టార్ స్టేటస్ అందుకున్న మీనా. సీతారామయ్య గారి మనవరాలు, చంటి, అబ్బాయిగారు, అల్లరి అల్లుడు, ముత్తు వంటి చిత్రాలతో ప్రేక్షకుల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించారు. ఇప్పటికీ క్యారెక్టర్ రోల్స్, కీలక పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. అయితే ఇటీవల మీనా రెండో పెళ్లి చేసుకోబోతున్నారంటూ వస్తున్న కథనాలు ఆమెను తీవ్రంగా కలచివేశాయట. వ్యక్తిగత జీవితంలో ఇప్పటికే పెద్ద విషాదాన్ని ఎదుర్కొన్న మీనా, మళ్లీ ఇలాంటి అసత్య ప్రచారాలు తనను మానసికంగా బాధిస్తున్నాయని తెలిపారు. "నిజం ఏంటో తెలుసుకోకుండా, మీ ఇష్టం వచ్చినట్లు కథలు అల్లడం ఎంతవరకు కరెక్ట్ ?" అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఒక ఒంటరి మహిళనని, అంతేకాదు ఒక కుమార్తె తల్లినని గుర్తుచేశారు. ఈ వార్తలు తన కూతురు చూసినప్పుడు ఆమె మనసుపై ఎలాంటి ప్రభావం పడుతుందో ఆలోచించాలంటూ మీడియా, సోషల్ మీడియాను కోరారు. ఇలాంటి రూమర్లకు స్పందించి తన సమయం, ఆరోగ్యం, ఎనర్జీని వృథా చేసుకోవాలని తనకు లేదని, పాజిటివ్‌గా జీవించడమే తన లక్ష్యమని మీనా స్పష్టం చేశారు. "కర్మ అనేది ఉంటుంది అని అది ఎవరినీ వదిలిపెట్టదు" అనే ఆమె మాటలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. మొత్తానికి ఎప్పుడూ సైలెంట్‌గా ఉండే మీనా ఇలా ఫైర్ అవ్వటం చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఇకనైనా ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఆగిపోవాలని ఆమె స్పష్టమైన హెచ్చరిక ఇచ్చినట్టే భావించాలి.

# కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది

'ధమాకా' తర్వాత హీరోయిన్ గా శ్రీలీల ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. బాలకృష్ణ- అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన 'భగవంత్ కేసరి' హిట్ అయినా.. అందులో శ్రీలీల హీరోయిన్ కాదు. అయినప్పటికీ దాని సక్సెస్ క్రెడిట్ శ్రీలీల ఖాతాలో పడలేదు.'స్కంద' 'ఆదికేశవ' 'ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్' 'గుంటూరు కారం' 'రాబిన్ హుడ్' 'జూనియర్' 'మాస్ జాతర' 'పరాశక్తి' ఇలా అన్నీ డిజాస్టర్లే. వేరే హీరోయిన్ ట్రాక్ రికార్డు ఇలా ఉంటే.. ఈపాటికి దుకాణం సర్దేసేది. కానీ శ్రీలీల ఆ విషయంలో లక్కీ అనే చెప్పాలి. ఇన్ని డిజాస్టర్లు పడినప్పటికీ.. ఆమె డిమాండ్ ఏమీ తగ్గలేదు. ఇప్పటికీ ఆమె కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది. ప్రస్తుతం ఆమె హిందీలో 2 సినిమాల్లో నటిస్తుంది. అవి రెండూ క్రేజీ ప్రాజెక్టులే. మరోవైపు తమిళంలో క్రేజీ ఆఫర్లు అందుకుంటుంది. ధనుష్ 50వ సినిమాలో సాయి పల్లవితో పాటు మరో హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తుంది. మరోవైపు పవన్ కళ్యాణ్ కి జోడీగా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో నటించింది. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన సినిమా అది. మార్చి 26న రిలీజ్ అవుతుంది. ఈ సినిమాకి సంబంధించి శ్రీలీల తన పాత్రకి డబ్బింగ్ చెప్పడం కూడా పూర్తయ్యింది. ఈ ఒక్క సినిమా హిట్ అయితే.. శ్రీలీల ఫ్లాప్స్ నుండి బయటపడినట్టే. దర్శకుడు హరీష్ శంకర్ కి కూడా ఫ్లాప్స్ లో ఉన్న హీరోయిన్స్ ని బయటపడేసిన ట్రాక్ రికార్డ్ ఉంది. సో శ్రీలీలకి గుడ్ టైమ్ స్టార్ట్ అయినట్టే...!





# భార్యపై ప్రేమను చాటుకున్న నిక్ జోనస్

తన భార్య, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా సంస్కృతిని గౌరవిస్తూ ఆయన చేసిన ఈ పని ఇప్పుడు నెటిజన్ల మనసు గెలుచుకుంటోంది. పురుషులు కూడా ఇలా చేయవచ్చా? అని అందరూ ఆశ్చర్యపోయేలా చేసిన ఆ విశేషాలేంటో చూద్దాం.. ఆయన ఒక గ్లోబల్ మ్యూజిక్ ఐకాన్. ఆమె ప్రపంచం మెచ్చిన భారతీయ నటి. వీరిద్దరి జోడీ అంటేనే ఒక సెలబ్రేషన్. తాజాగా ఆ పాప్ సింగర్ తన భార్య నటిస్తున్న 'ద బ్లఫ్' సినిమాలోని 'బ్లడీ మేరీ' పాత్రకు గుర్తుగా ఒక కాక్టెయిల్ తయారు చేస్తున్న వీడియోను షేర్ చేశారు. అయితే, అందరి దృష్టి ఆ కాక్టెయిల్ మీద కంటే ఆయన మణికట్టుపై ఉన్న ఒక నల్లపూసల గొలుసు మీదకు వెళ్లింది. హిందూ సంప్రదాయంలో కేవలం మహిళలు మాత్రమే ధరించే మంగళసూత్రాన్ని ఆయన బ్రాస్‌లెట్ రూపంలో ధరించడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ పాప్ స్టార్ మరెవరో కాదు.. నిక్ జోనస్. సాధారణంగా మంగళసూత్రం అంటే వివాహితలకు చిహ్నం. నల్లపూసలు, బంగారు సూత్రాలతో ఉండే ఈ పవిత్ర బంధం ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో సోనమ్ కపూర్ తన రాశి చక్రంతో కూడిన మంగళసూత్రాన్ని ఎంచుకోగా, ఆలియా భట్ తన హారంలో ఇన్ఫినిటీ గుర్తును చేర్చుకుంది. రాధికా మర్చంట్ సైతం తన మంగళసూత్రాన్ని బ్రాస్‌లెట్‌గా ధరించి ఆశ్చర్యపరిచింది. అయితే, ఇప్పుడు నిక్ జోనస్ దానిని ధరించడం ద్వారా ఒక సరికొత్త చర్చకు తెరలేపారు. పెళ్లయిన వస్తువులను, గుర్తులను కేవలం మహిళలు మాత్రమే ధరించాలా? అనే చర్చ ఎప్పటి నుంచో ఉంది. చాలామంది పురుషులు పెళ్లి ఉంగరాలను కూడా పెట్టుకోవడానికి ఇష్టపడని ఈ రోజుల్లో, నిక్ జోనస్ తన భార్య దేశపు సంప్రదాయాన్ని తన మణికట్టుపై ధరించడం విశేషం. ఇది కేవలం స్టైల్ కోసం చేసిన ప్రయత్నం కాదు, తన భార్య నమ్మకాల పట్ల ఆయనకు ఉన్న గౌరవానికి, ప్రేమకు నిదర్శనం. భార్యాభర్తలు ఇద్దరూ సమానమే అనే భావనను ఆయన ఈ చిన్న చర్య ద్వారా చాటిచెప్పారు. నిక్ జోనస్ ప్రభావంతో ఇప్పుడు పురుషుల మంగళసూత్ర బ్రాస్‌లెట్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోందని ప్రముఖ జ్యువెలరీ డిజైనర్లు చెబుతున్నారు.

# పవర్‌ఫుల్ లాయర్‌గా తాప్సీ పన్ను




ఒకప్పుడు తన అందాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు ఉత్తరాది భామ తాప్సీ పన్ను. కానీ అందరు హీరోయిన్ల మాదిరిగానే ఆమెకు బాలీవుడ్‌పై మోజు పుట్టి అక్కడే సెటిలైపోయింది. ఒకటి రెండు హిట్లు తప్పించి హిందీ చిత్ర పరిశ్రమలో తాప్సీ కెరీర్‌లో పెద్దగా మెరుపులు లేవు. కానీ ఏదో కిందా మీదా పడుతూ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు తాప్సీ. దోబారా, తడ్కా, బ్లర్, ధక్ ధక్, డూంకీ, ఖేల్ ఖేల్ మై తదితర సినిమాలలో ఆమె నటించారు. తాజాగా తాప్సీ పన్ను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం అస్సీ. మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాల బ్యాక్‌డ్రాప్‌లో యదార్థ ఘటనల తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ మూవీ అస్సీ. కోర్ట్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో తాప్సీ పన్ను పవర్‌ఫుల్ లాయర్‌గా నటించారు. ఫిబ్రవరి 20వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చింది. టీ సిరీస్ ఫిల్మ్స్, బెనారస్ మీడియా వర్క్స్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కృషన్ కుమార్, అనుభవ్ సిన్హాలు సంయుక్తంగా అస్సీ మూవీని నిర్మించగా.. అనుభవ్ సిన్హా దర్శకత్వం వహించారు. తాప్సీతో పాటు కని కుస్రుతి, రేవతి, మనోజ్ పహ్వా, కుముద్ మిశ్రా, మహమ్మద్ జీషన్ ఆయూబ్, సత్యజిత్ శర్మ, విపుల్ గుప్తా తదితరులు కీలకపాత్రలు పోషించారు. సీతా పహ్వా, సుప్రీయ పాఠక్, నసీరుద్దీన్ షాలు గెస్ట్ రోల్‌లో అలరించారు. ఈవారం ముల్లిగన్ ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా.. అమర్జిత్ సింగ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. రంజిత్ బరత్ సంగీత దర్శకత్వం వహించారు.

# స్టార్ హీరోహీరోయిన్లకు మించిన క్రేజ్



ప్రస్తుతం తెలుగు బుల్లితెరపై దూసుకుపోతున్న సీరియల్ గుండె నిండా గుడిగంటలు. అత్యధిక టీఆర్పీ రేటింగ్ తో ఈ సీరియల్ రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సాధారణ మధ్య తరగతి కుటుంబ కథతో సాగుతున్న ఈ సీరియల్ ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుంది. అందుకే ఈ సీరియల్ కు రోజు రోజుకీ విపరీతమైన రెస్పాన్స్ వస్తుంది. ఇక ఇందులో ప్రధాన పాత్రలు బాలు, మీనా జోడికి సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉందంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మీనా గురించి చెప్పుకుంటే.. అందంతోపాటు పద్ధతిగా చీరకట్టులో కనిపిస్తూ అద్భుతమైన నటనతో కట్టిపడేస్తుంది. మీనా అసలు పేరు అమూల్య గౌడ. కన్నడ సినీరంగానికి చెందిన ఈ ముద్దుగుమ్మకు తెలుగులో ఫాలోయింగ్ ఎక్కువే. సీరియల్లో పద్ధతిగా కనిపించే అమూల్య.. సోషల్ మీడియాలో మాత్రం గ్లామరస్ ఫోటోలతో రచ్చ చేస్తుంది. నెట్టింట ఈ అమ్మడు చేసే అరాచకం గురించి చెప్పక్కర్లేదు. మైసూర్ కు చెందిన అమూల్య గౌడ.. దాదాపు పదేళ్ల క్రితం సినీప్రయాణం స్టార్ట్ చేసింది. కన్నడ సీరియల్ స్వాతి ముత్తుతో నటిగా తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత కోమలి సీరియల్ ద్వారా ఫేమ్ సంపాదించుకుంది. కన్నడలో పలు సీరియల్స్ చేసిన ఈ అమ్మడు.. కార్తీక దీపం సీరియల్లో శౌర్య పాత్రతో తెలుగు అడియన్స్ ముందుకు వచ్చింది. ఇందులో రౌడీ బేబీగా మరింత పాపులర్ అయ్యింది. ఆ తర్వాత గుండె నిండా గుడిగంటలు సీరియల్లో మీనా పాత్రతో మరింత పాపులర్ అయ్యింది. ఈ సీరియల్ ఆమె కెరీర్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. ప్రస్తుతం ఈ సీరియల్ విజయవంతంగా దూసుకుపోతుంది. ఇక ఇప్పుడు ఆమె సోషల్ మీడియాలో గ్లామర్ లుక్స్ తో హీటెక్కిస్తుంది. ఇదిలా ఉంటే.. అమూల్య గౌడ ఒక్క ఎపిసోడ్ కోసం రూ.30 నుంచి రూ.35 వేలు తీసుకుంటుందట.

# ఫంకీ క్లోజింగ్ కలెక్షన్లు...

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు నిర్మించిన చిత్రం ఫంకీ. విశ్వక్‌సేన్, కాయదు లోహర్‌లు జంటగా నటించగా.. జాతిరత్నాలు ఫేమ్ అనుదీప్ కేవీ దర్శకత్వం వహించారు. వీకే నరేష్, వీటీవీ గణేష్, సంపత్ రాజ్, ఈశ్వరి రావు, రఘుబాబు, మురళీధర్ గౌడ్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ డైరెక్షన్ చేశారు.. నవీన్ నూలి ఎడిటర్‌గా, సురేష్ సారంగం సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించారు. వాలంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 13వ తేదీన ఫంకీ మూవీ వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో ఫంకీ బడ్జెట్ ఎంత? ప్రీ రిలీజ్ బిజినెస్ ఎంత? బ్రేక్‌ఈవెన్ టార్గెట్ ఎంత? విశ్వక్‌సేన్ మూవీకి క్లోజింగ్ కలెక్షన్స్ ఎంత? ఫంకీకి లాభమెంత? నష్టమెంత? అనేది పరిశీలిస్తే...నటీనటులు, సాంకేతిక నిపుణుల రెమ్యునరేషన్, ప్రొడక్షన్ కాస్ట్, ప్రమోషనల్ ఖర్చులు కలిపి ఫంకీ సినిమాకు దాదాపు 25 కోట్ల రూపాయల బట్జెట్ అయ్యింది.

